# ఓ కన్నీటి కథ

## శ్రీకంఠ స్ఫూర్తి

కమల కళ్ళనుంచి కన్నీళ్ళు జలజలా రాలుతున్నాయి...

బస్సు ముందుకు దూసుకు పోతూంది కిటికీ ప్రక్క సీటులో కూర్చుంది కమల. బయట ఎండ నిప్పులు చెరుగుతూంది. వేడిగాలి ఉండుండి విసిరి కొడుతూంది. ఎన్నో దృశ్యాలు కనుమరుగవుతూ వెనక్కి పోతున్నాయి ...

కమల కళ్ళనుంచి కన్నీళ్ళు జలజల రాలుతూనే ఉన్నాయి... ఎంత ఆపుకుందామన్నా ఉబికి వస్తోన్న దుఃఖం... ఆవేదన! కమల కొంగుతో కళ్ళు ఒత్తుకుంటోంది... అయినా ఆగని కన్నీటి స్రవంతి. ఆమె గుండెలు తడిసి పోతున్నాయి. ఆమె మనసు నిముష నిముషానికి బరువెక్కి బావురుమంటూంది. అంతర్యంలో బాధ కన్నీటి రూపంలో అలా కక్కుకుంటూ వస్తోంటే- మూగదానిలా ఆమె రోదిస్తోనే ఉంది. బస్సులో ప్రయాణీకులు ఆమెను వింతగా చూస్తున్నారు... జాలిగా చూస్తున్నారు... సానుభూతి కురిపిస్తున్నారు. ప్రక్కనే కూర్చున్న ఇద్దరాడవాళ్ళు తరచి తరచి అడిగినా ఆమె మాట్లాడే లేదు ఉలక లేదు .. పలక లేదు. ఆమె ఎందుకలా ఏడుస్తోందో- ఆమె కొచ్చిన కష్టం ఏమిటో ఎవరికీ అంతుపట్టలేదు.

బస్సు ముందుకు పరుగెడుతూనే ఉంది.

కమల కొద్దిగా కదిలింది. కొంగుతో మళ్ళీ కళ్ళు ఒత్తుకుంది ఇబ్బందిగా చేతులు పైట క్రిందకు పోనిచ్చి జాకెట్టు తడిమి తడిమి చూసుకుంది. ఆమెకు జాకెట్టు ఉపరితలం తడితడిగా తగిలింది. ఉబికి వస్తోన్న స్తన్యం! ఆమె ఇక ఉండబట్టలేక పోయింది. వెక్కి వెక్కి ఏడుస్తూ కిటికీ బయటకు చూస్తూ ఉండి పోయింది.

ఆరు నెలల పసిగుడ్డు. తన చిన్నారి కూతురు "శాంతి" కమల కళ్ళల్లో మెదిలింది. తన స్తన్యం కుదుపుతూ పాలు త్రాగాల్సిన పసి పిల్ల- అత్త మామల చేతుల్లో ఎలా ఉందో? ఏడుస్తోందేమో గుక్క బెట్టి.. తను కనిపించకపోతే బెంగతో నీరసించి పోతుంది.. తప్పదు తన పాలు తప్ప- పోతపాలు అసలు "శాంతి" త్రాగదు. ఏం జేస్తారు వాళ్ళు? పాలు తెప్పించి పడతారా? పట్టకుండా వదిలేస్తారా? ఊహూఁ పాలు పడతారు... కాని శాంతి ఆ పాలు త్రాగదు. పాలు త్రాగక- ఒకటే గుక్కబెట్టి ఏడిస్తే- తన శాంతి ఏమవుతుంది ? ఆ శాంతి కేదయినా అయితే తనేమవుతుంది? అమ్మో! శాంతిని మళ్ళీ తను చూడగలుగుతుందా? తను మళ్ళీ కాకినాడ వెళ్ళగలుగుతుందా? ఆ ఆశ లేదు ఆ నమ్మకంలేదు. ధైర్యం లేదు తన కలల పంట పసిడి ముద్ద... చిన్నారి శాంతి . అమ్మో! .

కమలకు దుఃఖం తెరలు తెరలుగా ఉబికి వస్తోనే ఉంది.

కట్నంతాలూకు బాకీ మూడు వేలు తీసుకు రాకపోతే- కన్న కూతురిమీద ఆశ ఒదులుకోమని ఖచ్చితంగా చెప్పింది అత్తగారు...

మళ్ళీ ఆ యింటి గడపలో కాలు పెట్టొద్దని గర్జించాడు మావగారు ..

తల్లి దండ్రుల్ని ఎదిరించలేక- అత్తగారు తనను మెడ బట్టుకుని గెంటుతూంటే ఆమెకు వత్తాసు పలుకుతూ ఉండిపోయాడు పిరికి భర్త ..

తన వెనకనే బస్టాండుకు వచ్చి . తమ ఊరుకు టిక్కెట్టు తీసి- బస్సెక్కించాడు. కట్నం డబ్బు తీసుకు రాకపోతే కాపురం లేదన్నాడు. కన్న కూతురు దక్కదన్నాడు. తను మరో పెళ్ళి చేసుకుంటానన్నాడు.

మొత్తం మీద ముగ్గురూ కలిసి ఆరు నెలల పసి పిల్లని తమ వద్ద ఉంచేసుకున్నారు.. కనికరం లేకుండా తల్లీ బిడ్డల్ని వేరు చేశారు ఇప్పుడేం చేయాలి?

బస్సు షడన్ బ్రేకుతో ఆగింది... కమల త్రుళ్ళిపడి ఈలోకంలోకి వచ్చింది. రోడ్డు కడ్డంగా బిక్క చిక్కిన గేదె.. దానివెంట పిల్ల కాబోలు నీరసంగా నడుస్తోంది. డ్రైవరు గ్యాసు హారను అదేపనిగా కొడుతున్నాడు. నాలుగు గంటల ప్రయాణం... మూడు గంటల ప్రయాణం అప్పుడే గడిచి పోయింది. ఇంకో గంటలో తను ఇంటికి చేరుకోవచ్చు...

కమల సీటుకు వెనక్కి చేరగిలపడి కళ్ళు మూసుంది... అయినా ఆమె కళ్ళు కన్నీటి సెలయేళ్ళుగా ఉబుకుతూనే ఉన్నాయి. మూడు నెలల నుంచి మరీ నరకయాతన పెడుతున్నారు. కనీసం బిడ్డతల్లి నన్న జాలి లేదు. అత్తగారు అనుక్షణం వేధింపు. సూటిపోటి మాటలు . ఒకోపూట అన్నం వండక పోవడం .. వండినా తనకు పెట్టక పోవడం భర్త సుబ్రహ్మణ్యం చీటికి మాటికి చెయి చేసుకోవడం .. మావగారు కూడా కనీస మానవత్వం లెకుండా తనపై విరుచుకుపడటం...

పెళ్ళిలో ఇస్తామన్న కట్నం నాన్న పూర్తిగా ఇవ్వలేక పోయాడు రెండు వేలు బాకీ పడ్డాడు. ఒక వెయ్యి ఆడపడుచు లాంఛనాలతో కలిసి మొత్తం మూడు వేలు ఇవ్వాలి మూడు నెలల్లో ఇస్తానని ఒప్పుకున్నది మూడేళ్ళు దాటింది ఈ మూడేళ్ళలోనూ- అమ్మ పోయింది నాన్న రిటైరయ్యాడు. వచ్చిన ప్రావిడెంటు ఫండు డబ్బుతో నిరుద్యోగ అన్నయ్య పరారీ అయ్యాడు నాన్నకు పెన్షన్ డబ్బులే ఆధారం ఇంక ఎలా- వాళ్ళ కట్నం బాకీ తీర్చడం? ఇంటికి వెళ్ళినా, నాన్నను పట్టుకుని తనూ- తనను పట్టుకుని నాన్న ఏడవటం తప్ప చెయ్య గలిగిందేమి లేదు. మరేం చెయ్యాలిప్పుడు? తన బ్రతుకును అంతం చేసుకోవడమే! శాంతి లేకుండా తను బ్రతకదు .. బ్రతక లేదు. . కట్నం డబ్బు తీసుకెళ్ళకపోతే- వాళ్ళు తనను బ్రతకనివ్వరు... శాంతిని కనిపించనివ్వరు..

కమల ఒక నిర్ణయానికొచ్చి కళ్ళు తెరిచేటప్పటికి బస్టాండులో బస్సు ఆగి ఉంది. ప్రయాణీకులంతా దిగి పోయారు. కమల కంగారుపడుతూ బస్సు దిగింది. స్టాండు బయట కొచ్చింది. అక్కడ రోడ్డు రద్దీగా ఉంది. ఒక దాని వెంట ఒకటి వాహనాల పరుగు.. జనం హడావుడి. ఎక్కడి కెళ్ళాలి? ఏం చెయ్యాలి?- ఆలోచించకుండానే కమల రోడ్డు మధ్యకు నడిచింది... ఆమె కళ్ళు మూసుకుంది. . మరుక్షణంలో ఓ- కెవ్వుమన్న కేక ఆ పరిసరాల్లో ప్రతిధ్వనించింది .

* * * * *

"కమల ఎక్స్‌పైర్డ్- స్టార్ట్" – రమణయ్య.

మెసెంజర్ చేతిలోంచి టెలిగ్రాం అందుకుని అదిరిపడ్డాడు సుబ్రహ్మణ్యం అతని వెన్నులోంచి వణుకు పుట్టింది . మనిషి నిలువెల్లా కంపించి పోయాడు. ఊహించని బాధ.. భయం అతని మనసును ఉక్కిరి బిక్కిరి చేశాయి ."అమ్మా!"

అరిచినట్టుగానే కేకపెట్టాడు సుబ్రహ్మణ్యం.

"ఏంటిరా? అంత గట్టిగా అరిచావు... వెధవ పిల్ల ఒకటే ఏడుస్తోంది!" దుర్గమ్మ వంటగదిలోంచి బయట కొచ్చింది.

"టెలిగ్రాం! అమ్మా! కమల. కమ..-" కొడుకు జీరబోయిన కంఠంతో చెప్పిన వార్త విని కొయ్యబారినట్లయ్యింది దుర్గమ్మ. కోడలు చనిపోయిందా! ఎంత పని చేసింది!

"ఏం చేద్దాంరా ఇప్పుడు?" ఆమె అయోమయంగా అడిగింది.

"ఏమురిది? పిల్లని తీసుకెళ్ళి అప్పగించి వచ్చేస్తాను. వెళ్ళకపోతే బాగుండదు . సూట్‌కేస్‌లో ఒక జత బట్టలు సర్దు! అది చస్తూ ఏం చెప్పిందో- వాళ్ళంతా ఏం గొడవ చేస్తారో!"

"మినాన్న బయటి కెళ్ళారు... ఆయ నొచ్చిన తరువాత మేమూ బయలుదేరి రమ్మంటావా?"

దుర్గమ్మ భయం భయంగా అడిగింది.

'వద్దు' మీరొస్తే– అక్కడి వాళ్ళంతా దాన్ని కాల్చుకు తిన్నారని – ఒకటే దుయ్యబడతారు. నేనెదో ఆ తతంగం పూర్తయ్యాక ఏదో చెప్పి... తప్పించుకుని వచ్చేస్తాను!"

కొడుకు సలహాతో దుర్గమ్మ గబగబా సూట్‌కేస్ సర్దింది

సుబ్రహ్మణ్యం ఆరు నెలల శాంతిని ఒక చేత్తో ఎత్తుకుని– హడావుడిగా బస్టాండుకు వచ్చాడు బస్టాండులో సిద్ధంగా ఉన్న ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు అతని మనసులో అలజడి . ఆందోళన!

కమల పుట్టింటికి వెళ్ళి అప్పుడే మూడు రోజులయింది... ఇంతలో ఇంత పని చేస్తుందని తను ఊహించ లేదు. ఈ మూడు రోజుల్నించి శాంత, ఇంట్లో ఒకటే ఏడుపు.. ఎంత ఊరుకో బెట్టినా– ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ పిల్ల ఏడుపు తగ్గలేదు..

సుబ్రహ్మణ్యం భారంగా తల పట్టుకున్నాడు...

బస్సు బయలుదేరి వేగాన్ని అందుకుంది. అతని మనసు కల్లోలంగా ఉంది అతని అణువణువు లోనూ అశాంతి పెల్లుబుకు తోంది ఒళ్ళో శాంతి ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది

ఇకనుంచి ఈ పిల్ల– తల్లిలేని పిల్లగా పెరుగుతుందా అనుకున్నాడు అలా అనుకోగానే అతని గుండె ఆర్ద్రంగా కొట్టుకుంది . కమల రూపం కళ్ళెదుట కనిపించి నట్లయ్యింది. ఎంత పని చేశావు– కమలా అంటూ తల వెనక్కి వాల్చాడు....

"ఎప్పుడూ తన మాటకు జవాబు చెప్పి ఎరుగదు ఎంత సహనం? తిట్టినా కొట్టినా, అన్నీ మౌనంగా భరించి ఊరుకునేది అన్ని విధాలా తన కనుకూలంగా రోజులు గడపటానికి ప్రయత్నం చేసేది. కమలని తను మూర్ఖంగా పోగొట్టు కున్నాడా?" సుబ్రహ్మణ్యంలో విచక్షణ మొద లయ్యింది విచక్షణ పెరిగి పెరిగి పన్నటి బాధ. విచారం అతనిలో అలుముకున్నాయి

బస్సు ఒక్క కుదుపుతో ఆగింది... ఒళ్ళో శాంత ఉలిక్కిపడి పడటం మొదలు పెట్టింది కండక్టరు, డ్రైవరు బస్సు దిగారు బస్సులోని ప్రయాణీకులు బస్సుదిగి కాఫీ హోటలు వైపు నడిచారు ఒళ్ళో శాంత ఏడుపు ఎక్కువయింది. సుబ్రహ్మణ్యం కూడా బస్సుదిగి హోటలు వైపు నడిచాడు. గ్లాసులో రెండు కప్పులు పాలు పోయించుకుని చెంచాతో నెమ్మదిగా పట్టించసాగాడు శాంత ఆకలిగా ఆ పాలు త్రాగుతూంటే అతని మనసు కరిగినీరయింది– ఏదో తృప్తిగా నిట్టూర్చింది.

బస్సు మళ్ళీ బయలుదేరింది.

కేవలం కట్నం డబ్బులకోసం– తల్లిదండ్రులతో చేతులుకలిపి కమలకు నిజంగా అన్యాయం చేశాడు వాళ్ళు దాన్ని ఎంత వేపుకు తింటున్నా తను కిమ్మనేవాడుకాదు తన మౌనాన్ని చూసి వాళ్ళు మరింత రెచ్చిపోయేవారు .. చివరకు పాలుత్రాగే పసిపిల్లని తనవద్ద ఉంచేసుకుని– అమ్మ కమలను బయటకు గెంటేసినా తను ఏమి మాట్లాడలేకపోయాడు చిన్నపిల్లని ఇక్కడ ఉంచేసుకుంటే– ఆ భయంతోనే పిల్లమీద బెంగతోనో– కమల తండ్రి దగ్గర్నుంచి కట్నం



డబ్బు తెస్తుందని తనూ భావించాడు... ఆ ముసలాడి దగ్గర డబ్బుందని అమ్మా - నాన్నా నమ్మకం! అన్నయ్య ఎత్తుకు పోయాడని కమల ఏడుపు.. తను ఏది నిర్ణయించుకోలేక కమలనే కొట్టేవాడు.. తిట్టేవాడు.. నిజానికి కమల డబ్బుతెస్తే- ఆ డబ్బుతో మరికొంత జతచేసి చిన్నమోటారుసైకిలు కొనుక్కుందామని తన ఆశ.... ఆలోచనాను.... కానీ అన్నీ బెడిసి కొట్టాయి... దేవతలాంటి భార్యని పోగొట్టుకున్నాడు. ఆ లోటు జీవితంలో తీరుతుందా? తన భవిష్యత్తు ఎలా ఉంటుంది?తను మరో పెళ్లి చేసుకోవాలా? మళ్లీ పెళ్లిచేసుకుంటే ఈ పిల్లగతి ఏమిటి? మావగారి దగ్గర ఒదిలే యడమేనా!

సుబ్రహ్మణ్యం సీటులో ఇబ్బందిగా కదిలాడు... బస్సులో జనం ఎవరిమాటల్లో వాళ్ళున్నారు... ఎవర్నీ పట్టించుకోకుండా బస్సు ముందుకు పరుగెడుతూనే ఉంది... సుబ్రహ్మణ్యం కూతురు శాంతి వంక జాలిగా చూసుకున్నాడు. అతని కళ్లు చెమర్చాయి. ఆ పిల్ల అమాయకంగా నిద్ర పోతోంది.... ఈ పిల్లలో అన్నీ కమల పోలికలే! అనుకోకుండా ఉండలేక పోయాడు సుబ్రహ్మణ్యం... చేతివాచీవంక చూసుకున్నాడు. టైము రెండున్నర... వేడిగాలి వీస్తోంది...

కమల మంచితనం... ప్రవర్తన తలచుకున్నకొద్దీ సుబ్రహ్మణ్యానికి పిచ్చెక్కినట్లుగా ఉంది.... ఎంత

# ఓ కన్నీటి కథ

సరిపెట్టుకుందామన్నా ఆమె తలపులు అతడ్ని పీడటంలేదు.... భార్య రూపం పదే పదే గుర్తుకు వస్తోంది...

కమలకు పౌరుషం, అభిమానం ఎక్కువ.... తనెప్పుడైనా తిట్టినా కొట్టినా- రెండు మూడు పూటలు అన్నం మానేసి ఉండిపోయేది...


ఆ అభిమానంతోనే ఆత్మహత్య చేసుకుందేమో! కమల చనిపోతూ ఏం చెప్పి ఉంటుంది? తన మీద, తన తల్లి దండ్రులమీద పగ తీర్చుకుంటుందా? ఏమో! భర్త కొట్టేవాడని- అత్త మామలు కట్నం కోసం కాల్చుకుని తినేవారని- వాళ్ళే తన చావుకు కారణమని ఏదైనా చిన్న చీటీ రాసి పెడితే... అమ్మో!" సుబ్రహ్మణ్యం ఉలిక్కిపడ్డాడు. అతనిలో తెలియని భయం ప్రవేశించింది. ఆ భయంలో కొట్టుమిట్టాడు తూండగానే బస్సు గమ్యం చేరిపోయింది. స్టాండులో దిగి- కూతురు శాంతిని మరో భుజం మీదకు మార్చుకుని గబగబా రోడ్డుమీద కొచ్చాడు... బేరమాడకుండానే రిక్షా కట్టించుకున్నాడు. రిక్షా పది నిముషాలు పరుగెత్తి ఓ ఇరుకు వీధిలోకి మళ్ళింది. వీధి మొదట్నించే ఆతంగా మావగారింటి వైపు దృష్టిని సారించాడు సుబ్రహ్మణ్యం. అక్కడ జనం ఎవ్వరూ లేరు... ఏమయ్యింది? శవాన్ని అప్పుడే తీసుకు వెళ్ళిపోయారా? తనూ, తనవాళ్ళూ రాకుండానే! తన మావగారు- ఒకవేళ పోలీసులకు భయపడి... ఆయనసలే పిరికి మనిషి. తనకు టెలిగ్రాం ఉదయం ఏడు గంటల కందింది... అదెప్పుడో నిన్న సాయంత్రం- ఆరు గంటల కిచ్చారు... ఏం జరిగింది?

రిక్షా ఇంటి ముందాగింది. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించి- తడబడుతూన్న మనసుతో లోపలికి నడిచాడు సుబ్రహ్మణ్యం. తలుపులు తీసి ఉన్నాయి. వసారా ఖాళీగా బావురు మంటోంది. కొద్ది క్షణాలు అక్కడే అయోమయంగా నిలబడ్డాడు. గొంతు పెగిలి రావటం లేదు. చిన్నగా సకిలించాడు... లోపల గదిలోంచి ఎవరో వస్తున్న అలికిడి....

"బాబూ! వచ్చావా! శాంతిని కూడా తీసు కొచ్చావా?" ఎదురుగా గదిలోంచి బరువుగా- భారంగా తన మావగారు రమణయ్య...

"నన్ను- క్షమించండి! కమల ఇంత పని చేస్తుందనుకోలేదు. సమయానికి నేను ఊళ్ళో లేను. అమ్మా నాన్నా ఏదో చాదస్తంగా నాలుగు మాట లనేసరికి- కమల పౌరుషంగా పిల్ల నొదిలి వచ్చేసిందట! మావయ్యగారూ! శాంతి నేనూ ఇకపై దిక్కులేని వాళ్ళమయ్యాం!"

సుబ్రహ్మణ్యం తన తప్పును కప్పి పుచ్చుకుంటూ






నూతన యవ్వనం పొందండి! సంతాన వంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్కలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేక పోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టు ద్వారా చికిత్స కలదు.


"క్యాంపులు": ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6-30 గం. వరకు. ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్,

పార్కురోడ్, గుడివాడ - 521301

ఫోన్స్ : 522 & 540




### ఆర్. వి. ఆర్. – రాజమండ్రి

నాకు చిన్నప్పటినించి రాత్రి 9 గంటల తర్వాత నిద్ర విపరీతంగా వచ్చేస్తుంది. ఎంత ఆపుకుందా మన్నా ఆపుకోలేను. అటువంటిది యిప్పుడు పగలు కూడా విపరీతంగా నిద్ర వచ్చేస్తోంది. చదువుతుంటే అలా చదువుతూనే నిద్రపోతాను.

★ చదువుతున్న పుస్తకం మీద ధ్యానం లేనప్పుడు ఇలాగే జరుగుతుంది. పడుకొని చదివినా, అన్నం తిన్న వెంటనే చదివినా ఇలా జరిగే అవకాశం ఎక్కువ. తిరుగుతూ చదివే అలవాటు చేసుకొంటే ఈ లక్షణం నుంచి కొన్నాళ్ళలో తప్పించుకోవచ్చును.

### యస్. జె – కరింనగర్

నేను సన్నగా, పొడుగ్గా వుంటాను. ఆడవాళ్ళు సన్నగా వున్న భర్త వలన తృప్తి పొందరని ఒక స్నేహితుడు వాదిస్తున్నాడు. నిజమేనా?

● పూర్తి అబద్ధం. అసలు సన్నగా ఉన్న భర్తల వల్లనే పూర్తి తృప్తి పొందే అవకాశం ఉంటుంది.

### యమ్. వి. ఆర్. – కమలాపురం

నల్లగా వున్నవారు కొద్దిగా అన్నా తెల్లగా మెరుగు రావటానికి మెడిసన్ ఏదన్నా వుంటే చెప్పండి. మెలనిన్ తగ్గటానికి మందులు చెప్పండి.

★ ఇలా జరగటానికి ఏ మార్గమూ, మందులూ లేవు.

### ఐ. వి. – ఖరగ్‌పూర్

నా వయస్సు 18 సంవత్సరములు. నేను సన్నగా పొడుగ్గా వుంటాను. నేను ఆంధ్ర వెడితే లావవుతాను. కాని యిక్కడ వుంటే సన్నగా వుంటాను. ఇక్కడ వాతావరణం నాకు సరిపడదా? లేక యింకేమన్నా కారణమా?

★ బహుశా ఆంధ్ర మీ పుట్టిల్లు అయి ఉంటుంది. అక్కడి ఆదరణ, పని లేకపోవటం, మానసిక ఉల్లాసం మొదలయిన వన్నీ లావు అవటానికి దోహదం చేసి ఉంటాయి.

### యస్. యస్. – గుంటూరు

మా యింట్లో అందరికి పేలు, ఈపి ఎక్కువగా వున్నాయి. తగ్గేందుకు మందు చెప్పండి.

★ బెంజైల్ బెంబొయేట్ 20 శాతం మందుగాని, గామా బెంజీన్ హెక్సాక్లోరైడ్ గాని పై పూతగా వాడవలసి ఉంటుంది అయితే దీనిని క్రమబద్ధంగా పూయవలసి ఉంటుంది.

తలకి బాగా స్నానం చేసి, తడి ఆరిన తర్వాత అన్ని వెంట్రుకలకి కుదుళ్ళ నుంచి చివరిదాకా అంటేటట్లుగా పై మందులను పూసి 12 గం. లు నాన నివ్వాలి. తర్వాత మళ్ళీ తలారా స్నానం చెయ్యాలి. అలా వరుసగా మూడు రోజులు చెయ్యటం అవసరం. ఇంట్లోని ప్రతివారు ఒకేసారిగా ఈ మందు వాడాలి. దువ్వెనలు వేరుగా ఉంచాలి. తలగడ గలీబులు, దుప్పట్లు మొదలయిన వాటిని నీళ్ళలో ఉడికించి వాడితే తిరిగివేలువచ్చే అవకాశం ఉండదు.

### సి. హెచ్. సి. – చిలకలూరిపేట

నాకు 16 సంవత్సరములు . 5 నెలల నుండి మెన్సెస్ అయినపుడు కాళ్ళు, నడుము, కడుపులో నొప్పి వస్తున్నది.

★ రజస్వల అయిన కొన్ని సం. ల పాటు పై లక్షణాలన్నీ సహజమే!

తాత్కాలిక ఉపశమనంగా ఆస్పిరిన్, ఆంటి స్పాస్మోడిక్ మాత్రలు వాడటం మంచిది. □

---

గొంతులో పశ్చాత్తాపాన్ని పలికించాడు. అంతులేని బాధని, దుఃఖాన్ని ఒలికించాడు.

"ఫరవాలేదు బాబూ! దాని ఖర్మ... నువ్వేం చేయగలవు..." రమణయ్య నిట్టూరుస్తూ అల్లుడి చేతిలోంచి మనవరాలిని ఎత్తుకున్నాడు. శాంతి తుళ్ళిపడి లేచి ఏడుపు మొదలెట్టింది... ఆ ఏడుపు పెద్దగా ఆ యింట్లో ప్రతిధ్వనించింది.

"అమ్మా! శాంతీ!" ప్రక్క గదిలోంచి ఓ ఆకారం సుడిగాలిలా పరుగెత్తుకొచ్చి రమణయ్య చేతుల్లోని.శాంతిని చుట్టేసింది.

సుబ్రహ్మణ్యం శిలా విగ్రహంలా నిలబడి పోయాడు. అతని నోటి వెంట మాట రాలేదు. ఏమిటిది? కమల... తన భార్య బ్రతికే ఉందా? కమల చనిపోలేదా? తనెంత మధనపడ్డాడు? ఎంత నరకం అనుభవించాడు?

కమల గదిలో ఒకమూలగా చతికిలపడి పోయింది. పైట తప్పించి– జాకెట్టు వదులు చేసి– ఆర్తిగా, ఆత్రంగా కూతురికి స్తన్యం కుడుపుతూ తన్మయంగా కళ్ళు మూసుకుంది.

ఆమె కళ్ళ వెంట కన్నీళ్ళు ధారలు కడుతూనే ఉన్నాయి.

"బాబూ! నా కూతుర్ని బ్రతికించుకోవడం కోసం... ఒక్క క్షణం– ఆ కూతురే చచ్చిపోయిందనుకుని నీకు టెలిగ్రాం ఇచ్చాను. అది చనిపోయిందని తెలిస్తే, తప్పకుండా నువ్వు శాంతిని వెంట బెట్టుకుని వస్తావని ఆశపడ్డాను. అలాగే నువ్వు శాంతిని తీసుకొచ్చావు... నిజానికి నా కూతురు వచ్చేదారిలో తన బ్రతుకును అంతం చేసుకుందామని బస్సు క్రింద పడబోయిందట! అదృష్టవశాత్తూ తెలిసిన వాళ్ళ కళ్ళబడి నన్ను చేరింది. దానికి తన కూతురు కావాలి. శాంతి లేకపోతే అది బ్రతకదు. దానిమీద బెంగతో ఈ మూడు రోజుల్నించి తిండి మానేసి చిక్కి శల్యమయి పోయింది. శవంలా మంచానపడి– "నాన్నా" నాకు శాంతి కావాలి.... శాంతి కావాలంటూ ఒకటే పలవరింత! ఏం చెయ్యను నేను? శాంతిని ఎలా తీసుకురాను? నా కూతుర్ని ఎలా బ్రతికించుకోను? ఆలోచించాను. అందుకు అబద్ధపు టెలిగ్రాం ఒకటే మార్గంగా తోచింది... నా ప్రయత్నం ఫలించింది... మీ అమ్మా, నాన్నా కేవలం కట్నం డబ్బుకోసం– తల్లినీ పిల్లనీ వేరు చేశారు... ప్చ్! ఆడపిల్ల బ్రతుకు ఎంత దయనీయంగా మారిపోయింది బాబూ! నీలాంటి చదువుకున్న వాళ్ళు కూడా అదే మార్గంలో నడిస్తే– అన్యాయమై పోతున్న ఆడజాతికి దిక్కేది బాబూ...? ఆ కట్నం బాకీ నేనిప్పుడు తీర్చే స్థితిలో లేను. ఆ కట్నం డబ్బే– దాని కాపురాన్ని నిలబెట్టే బంధం అయితే అది నా దగ్గర లేదు... నా కూతురు నాదగ్గరే ఉంటుంది బాబు... నాతో బాటే కలో గంజో త్రాగుతుంది!"

సుబ్రహ్మణ్యం మాట్లాడ లేదు. అతనిలో అంతులేని భావ సంచలనం మావగారి మాటలతో అతని మనసు మంచులా చల్లబడి పోయింది.

"మావగారూ! తల్లీ బిడ్డల్ని వేరు చేయడంలో నా పిరికితనం ఉంది. నా తప్పూ ఉంది... ఆ తప్పేమిటో నాకు తెలిసింది. నా కమల నాకు దక్కింది... నాకు మరింకేమీ వద్దు... అమ్మా నాన్నల మనస్తత్వాలు అంత త్వరగా మారవు. కమలను కొద్దికాలం మీ దగ్గరే ఉంచండి! త్వరలో నేనీ వూరికి బదిలీ చేయించుకుంటాను!"

సుబ్రహ్మణ్యం కళ్ళనిండా ప్రేమ నింపుకుని భార్య కమల వైపు చూశాడు... అతనిలో ఊహించని మార్పుకు– కమల కళ్ళ నించి మళ్ళీ కన్నీళ్ళు జలజలా రాలాయి. అవి కన్నీళ్ళా మరి? కాదు... కాంతి జలపాతాలు! □